ప్రజాశక్తి
మంగళవారం 17 సెప్టెంబర్ 2024 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పాలుట్లకు పోయేదెట్లా..?

- దశాబ్దాలుగా రోడ్డు లేక
- గిరిజన గూడెం వాసుల ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పాలుట్లకు వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల పరిధిలోని దట్టమైన నల్లమల అడవిలో ఉన్న పాలుట్ల గిరిజన గూడెంకు దశాబ్దాలు గడిచినా రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో విద్యా, వైద్యం సక్రమంగా అందక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గూడేల్లో ఐటిడిఎ పరిధిలో ఆశ్రమ పాఠశాలలు నిర్వహిస్తున్నా రోడ్డు సౌకర్యం లేక ఉపాధ్యాయులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారు. గిరిజన పిల్లలు సక్రమంగా చదువుకోలేక పోతున్నారు. పాలుట్ల, అల్లిపాలెం, దద్దనాల గిరిజన గూడేల్లో ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. రోడ్డు లేవనే కారణంతో దద్దనాల, అల్లిపాలెం ఆశ్రమ పాఠశాలలను గంజివారిపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్‌కు మార్చారు. పాలుట్లలో మాత్రం ఆశ్రమ పాఠశాల నిర్వహిస్తున్నారు. పాలుట్ల గిరిజన గూడెం, దాని పరిసరాల్లో నెక్కంటి, తెలుగురాయుని చెరువు, గుట్టలచేను, నారుతడికలలో కలిపి 2000 పైగా గిరిజనులు నివాసం ఉంటున్నారు.

2012లో సంవత్సరంలో..

2012లో అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాలుట్ల గిరిజన గూడెంకు 38 కిమీ పొడవునా గ్రావెల్ రోడ్డు నిర్మాణం రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ చట్టం ద్వారా రూ. 16.90 కోట్లు మంజూరు చేయించారు. కేంద్ర అటవీ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు చేపట్టలేదు. ఐటిడిఎ అధికారులు, రాష్ట్ర గిరిజన కమిషనర్ కార్యాలయం అధికారులు పర్యటించిన సమయంలో అనుమతులు తెచ్చి రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పినప్పటికీ సాధ్యపడలేదు.

వైపాలెం నుంచి పాలుట్ల వెళ్లాలంటే..

యర్రగొండపాలెం నుంచి పాలుట్ల గిరిజన గూడెంనకు వెళ్లడానికి జీపులతోనే సాధ్యం. రానుపోను 8 గంటలు సమయం పడుతుంది. పాలుట్ల గిరిజన గూడెం పేరున ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. దాన్ని గంజివారిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్నారు. డాక్టర్లు నెలకు రెండు పర్యాయాలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ మధ్యలో జ్వరాలు వచ్చినా, ఏదైనా ప్రమాదాలు జరిగినా యర్రగొండపాలెం లేదా దోర్నాల వెళ్లి చికిత్స పొందాల్సి వస్తుంది. పాలుట్లను పంచాయతీగా ఏర్పాటు చేశారు. అయినప్పటికీ రహదారి సౌకర్యం ఏర్పాటు చేయలేదు.

పంటలు అమ్ముకోవాలంటే..

పాలుట్ల గిరిజన గూడెంలో సార వంతమైన భూములు ఉన్నాయి. భూ ముల్లో బావులు తవ్వుకున్నారు. విద్యుత్ సౌకర్యం లేని కారణంగా ఆయిల్ ఇంజన్లతో ▶ 2లో

సాగునీటిపై పాలకపక్షం మౌనం

- ఆరుతడి పంటలకే
- నీరు ఇవ్వాలని నిర్ణయం
- నీరున్నా ఇదేం
- నిర్ణయమంటున్న రైతుసంఘాలు
- నారుమడులకు సమయం
- దాటిపోతుందని రైతుల కలవరం



కారంచేడు వద్ద కొమ్మమూరు కాలువ

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

వరదలతో రాష్ట్రం అల్లకల్లోలమవుతోంది. అయినప్పటికీ మాగాణికి నీరివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడుతోంది. కృష్ణాబోర్డు జలాల పంపిణీ చేసింది. ఈఏడాది సాగర్ ఆయకట్టులో ఆరుతడి పంటలకే నీరిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇపుడు రిజర్వాయర్లు నిండిపోయాయి. లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. ఈతరుణంలోనూ మాగాణికి నీరివ్వకపోతే పరిస్థితి ఏమిటన్నది ఆందోళనగా మారింది. పాలక పక్షనేతలు దీనిపై మౌనంగా ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఇద్దరు మంత్రులకూ ఈవ్యవహారం పట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాగునీటి విషయం ఎమ్మెల్యేలకూ పట్టడం లేదు. మరోవైపు సాగర్ ఆయకట్టులో నారుమడులకు సమయం దాటిపోతుందని రైతులు కలవరపడుతున్నారు. మాగాణికి నీరివ్వాలని జాతీయ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రైతుసంఘాల ప్రతినిధులు ఆందోళన చేశారు. మరోవైపు రైతు సంఘం కూడా సాగునీరివ్వాలని కోరింది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. వరదల్లో అందరూ ఉన్నారు. కనీసం జిల్లానేతలైనా దీన్ని పట్టించుకుంటారా?అంటే ఎవరూ సాగు నీటిపై మాట్లాడటం లేదు. ఇప్పటికీ ఆరుతడి పంటలకే నీరివ్వాలనే నిర్ణయమే ఉంది. రెండేళ్లుగా మాగాణికి నీళ్లులేవు. వర్షాధార పంటలు సాగుచేయడంతో బీడుగా మారింది. రబీలోనూ కరువు వెంటాడింది. ఏపంట కూడా చేతికి రాలేదు. కరువు బృందాలు కూడా జిల్లాలో పర్యటించాయి. ఇంకా పరిహారం కూడా రాలేదు. ఈ ఏడాది ఖరీఫ్ కూడా ఆశాజనకంగా లేదు.ఇప్పటికీ 45శాతం విస్తీర్ణంలోనే ఖరీఫ్ పంటల సాగు జరిగింది. వ్యవసాయం ఇలా నష్టాల పాలవుతుంటే ▶ 2లో

కాగుతున్న నూనెలు

- దిగుమతి సుంకం పెరగటమే
- ధరల పెరుగుదలకు కారణం
- లీటర్ ప్యాకెట్‌పై రూ.20 పెరుగుదల
- ఇప్పట్లో ధరలు తగ్గవంటున్న వ్యాపారులు
- లబోదిబోమంటున్న వినియోగదారులు



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వంట నూనెలు సలసల కాగుతున్నాయి. దిగుమతి సుంకం 20 శాతం పెరగటం ఆయిల్ ధరల పెరుగుదలకు కారణమైంది. లీటర్ వంట నూనె ప్యాకెట్‌పై ఒక్క సారిగా రూ.17 నుంచి 20 మేర ధర పెరిగింది. దసరా, దీపావళి పండుగలు రానున్న నేపథ్యంలో వంట నూనెల ధరలు పెరగటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.


వంటల్లో పామాయిల్, సన్‌ఫ్లవర్ , వేరుశనగ నూనెలను వినియోగిస్తారు. సన్‌ఫ్లవర్, సోయా నూనెను అర్జెంటీనా, బ్రెజిల్,రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి కేంద్రం దిగుమతి చేసుకుంటుంది. పామాయిల్‌ను ఇండోనేషియా, మలేసియా, థాయిలాండ్ దేశాల నుంచి దిగుమతి అవుతోంది. పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా నూనెపై అగ్రికల్చర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్ వసూలు గతంలో ఉన్న దిగుమతి సుంకం 5.5 నుంచి 27.5 శాతం పెంచింది. రిఫైన్డ్ పామాయిల్, సోయా నూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై దిగుమతి సుంకం గతంలో ఉన్న 15.75 నుంచి 35.75 శాతం పెంచుతూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

లీటర్ ప్యాకెట్‌పై రూ.20లు పెరుగుదల

వంట నూనెల లీటర్ ప్యాకెట్‌పై రూ.17 నుంచి రూ. 20 ధర పెరిగింది. పామాయిల్ లీటర్ ప్యాకెట్ ధర గత నెలలో 95లు ఉండగా, 10 రోజుల క్రితం 100 చేరుకుంది. నేడు లీటర్ ధర రూ.120 చేరుకుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ ప్యాకెట్ ధర ప్యాకెట్ ధర గత నెలలో 120 ఉండగా, 10 రోజుల క్రితం రూ.125 చేరింది. ప్రస్తుతం సన్ ఫ్లవర్ ఆయిల్ ధర రూ.150 అయింది. వేరుశనగ నూనె గత నెలలో రూ.110, 10 రోజుల క్రితం రూ.120 అమ్మారు. నేడు వేరుశనగ నూనె లీటర్ ధర రూ. 160 చేరింది. రైస్ బ్రాన్ లీటర్ ప్యాకెట్ ధర ప్యాకెట్ ధర గత నెలలో 110 ▶ 2లో

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సాగునీటి సమస్యలు పరిష్కరించండి
- మంత్రి స్వామికి సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టంగుటూరు

వెనకబడిన ప్రకాశం జిల్లాలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు కోరారు. జిల్లాలో తాగు, సాగు నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామికి జిల్లా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో మంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగరావు మాట్లాడుతూ జిల్లా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లను పున: నిర్మించాలన్నారు. ముసి, పాలేరుకు శాశ్వతంగా సాగర్ నీరు అందించాలని కోరారు. సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లాకు రావల్సిన వాటా నీటిని సాధించి వరి సాగును నీరు ఇవ్వాలని కోరారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టి సహాయ పునరావాసంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. కొండపి నియోజక వర్గ పరిధిలోని మండలాలను సాగార్జున సాగర్ కుడికాలువ, వెలిగొండ ప్రాజెక్టుతో అనుసంధానించాలని కోరారు. ఈ ప్రాంతంలోని వాగులను జీవ నదులుగా మార్చేందుకు, పుష్కలంగా వేలాది ఎకరాలకు నీరు అందించేందుకు ముసి, పాలేరు వాగులపై హనుమంతరావు టెక్నాలజీ చతుర్విధ జలప్రక్రియ ఉపయోగ పడుతుందన్నారు. స్వల్పకాలంలో స్వల్ప నిధులతో సాకారమయ్యే ఈ విషయమై దృష్టి సారించాలని మంత్రి స్వామిని చుండూరి రంగారావు కోరారు. ఖరీఫ్ కాలం ముగియ నున్నదని, అక్టోబరు నుంచి రబీ సీజన్ ప్రారంభంకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఎలాంటి జాప్యం జరుగకుండా ఆయుకట్టుకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం తరపున జిల్లాలో అధికారిక సమావేశం నిర్వహించాలని కోరారు. సాగర్ కుడి కాలువ ద్వారా జిల్లా వాటా నీరు రాబట్టాలని ▶ 2లో

సాగునీటిపై పాలకపక్షం మౌనం

(మొదటిపేజీ తరువాయి)

నీళ్లున్నా మాగాణికి నీరివ్వడం లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 4.50 లక్షల ఎకరాల్లో ఆయకట్టు ఉంది. ఇందులో సుమారు 1.98 లక్షల ఎకరాలు మాగాణి ఉంది. మిగతా విస్తీర్ణం ఆరుతడి పంటలు వేసుకుంటారు. మొత్తం ఆయకట్టులో ఆరుతడి పంటలే వేసుకోవాలని ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. దీంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. మాగాణి భూముల్లోనూ ఆరుతడి పంటలు అంటే ఏమి వేసుకోవాలో అంతు చిక్కడలేదు. సాగుచేసిన పంటలకు నీరందర గతేడాది రబీలోనూ అన్నీ ఎండిపోయాయి. ప్రత్యాయ్నాయ పంటలు ఏమిటనేదీ స్పష్టత లేదు. మిర్చి,పత్తి,శనగ వంటివి వేస్తున్నారు.మాగాణి భూముల్లో కేవలం వరి తప్ప ఇతర పంటలు పెద్దగా పండటం లేదు. దీంతో రైతులు వేసిన పంటల దిగుబడి రానందున నష్టపోతున్నారు. వాస్తవానికి ఇపుడు నారుమడులు పోస్తారు. వచ్చేనెలలో నాట్లు మొదలవుతాయి. నారమడులు పోయాలా? లేదా అనేదీ స్పష్టత లేదు. రిజర్వాయర్‌లో సగం నీళ్లున్నా గతంలో మాగాణికి, ఇతర పంటలకు నీళ్ల వదిలారు. ఇపుడు కనీసం దానిపై ఆలోచించే నాధుడే కరువయ్యాడు. ప్రతిపక్షంలో ఉన్నపుడు కాలువలపై పర్యటించి హడావిడి చేసిన నేతలు ఇపుడు మౌనం దాల్చారు. ఇక ప్రతిపక్ష వైసిపి కూడా మౌనంగానే ఉంది. ఉన్న ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా సాగునీటిపై మాట్లాడటం లేదు. కనీసం నీళ్లివ్వాలని కూడా అడగటంలేదు. రైతుసంఘం జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో మాగాణికి నీరివ్వాలని తీర్మానించింది. ఈఏడాది కూడా మాగాణి లేకుంటే ధాన్యం కొరత పెరుగుతుంది. బియ్యం ధరలూ పెరుగుతున్నాయి. పశుగ్రాసం కోల్పోతాం. పాడిపరిశ్రమపైనా ప్రభావం పడుతుంది.కూలీలకు పనులు పోతాయి. ఉపాధికీ పెద్ద గండి పడుతుంది. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం దీనిపై తక్షణం నిర్ణయం తీసుకోవాలి.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. పొదిలి పెద్ద చెరువుకు పైపులైన్ ద్వారా సాగర్ నీటిని మళ్లించే పథకం మధ్యలో ఆగిపోయిందని, పనులను పూర్తి చేయించి ఆ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చాలని విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన మంత్రి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు తమ ప్రాధాన్యతలో ఉందని, మిగిలిన అంశాలు సాధ్యా, సాధ్యాలను బట్టి ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులు, అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి స్వామికి వినతి పత్రం అందజేసిన వారిలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శులు పమిడి వెంకట్రావు, కె. వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె.జయంతి బాబు, విప్లవ రైతు సంఘం జిల్లా కన్వీనర్ బి. సుబ్బారావు, ఒపిడిఆర్ జిల్లా నాయకుడు చావలి సుధాకర్, డిసిసి జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె. సైదా, ఆ పార్టీ నాయకురాలు దాసరి నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

కాగుతున్న నూనెలు

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా, ప్రస్తుతం లీటర్ ధర రూ.130 చేరింది.

ధరలు ఇప్పట్లో తగ్గేటట్లు లేవు

ఏల్చూరి వెంకటేశ్వరరావు, హోల్‌సేల్ వ్యాపారి, ఒంగోలు

వంట నూనె ధరలు ఇప్పట్లో తగ్గేటట్లు లేవు. లీటర్ ప్యాకెట్‌పై ధర రూ.20 వరకూ పెరిగింది. రానున్న కాలంలో దసరా, దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో వంట నూనెల ధరలు పెరిగాయి. వినియోగదారులు తప్పని పరిస్థితులలో కొనుగోలు చేస్తున్నారు. పెరిగిన ధరలు నవంబర్ వరకూ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పామూరు ఎస్ఐగా కిషోర్ బాబు

ప్రజాశక్తి-పామూరు



పామూరు ఎస్ఐగా టీ కిషోర్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన త్వరలో చార్జ్ తీసుకోనున్నట్లు తెలిసింది.

బాపట్ల జిల్లా పేరును

జాతీయ స్థాయిలో నిలబెట్టిన భవ్యశ్రీ: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టిన పదో తరగతి విద్యార్థిని భవ్యశ్రీని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అభినందించారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పర్యావరణ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారు నిర్వహించిన పోస్టర్ ప్రజెంటేషన్ కాంపిటీషన్‌లో జిల్లా విద్యార్థినికి జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. బాపట్ల జిల్లా కొండమంజులూరు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పంచుమర్తి భవ్యశ్రీ రూపొందించిన పోస్టర్ ప్రథమ స్థానంలో నిలిచినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ భవ్యశ్రీకి సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రూ.10 వేల నగదు పారితోషకాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ అందజేశారు. విద్యార్థినికి జ్ఞాపికతోపాటు ప్రోత్సాహక బహుమతులను ఆయన అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షిస్తే ఓజోన్ పొర క్షేమంగా ఉండి



భవ్యశ్రీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి

ప్రజలను కాపాడుతుందని కలెక్టర్ చెప్పారు. ప్రజలంతా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. భూమి చెట్లతో నిండి ఉంటే పర్యావరణం సుభిక్షంగా ఉంటుందనే భావంతో విద్యార్థిని పోస్టర్‌ను చక్కగా ఆవిష్కరించిందన్నారు. విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని కలెక్టర్ కుశల ప్రశ్నలు వేసి ఆసక్తికరమైన సమాధానాలు రాబట్టారు. జిల్లా కీర్తిని జాతీయస్థాయిలో ఇనుమడింప చేసినందుకు ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏం చదవాలనుకుంటున్నావు, పెద్దయ్యాక ఏమవుతావని కలెక్టర్ అడిగారు. ఐఏఎస్ చదవాలని అనుకుంటున్నట్లు భవ్యశ్రీ చెప్పగా మరింతగా అభినందిస్తూ, తగిన సబ్జెక్టులను ఎలా ఎంచుకోవాలో మార్గనిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థిని తల్లిదండ్రులను పలకరించి విద్యాభ్యాసం, వారి కుటుంబ నేపథ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవ్యశ్రీ మొదటి నుంచి చిత్రలేఖనంలో ఆసక్తి కనబరుస్తుందని తల్లిదండ్రులు కలెక్టర్‌కు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు తెచ్చుకునేలా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. చిత్రలేఖనంలో భవ్యశ్రీకి ఎప్పటికప్పుడు సూచనలిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐ అనిత, చిత్రలేఖన ఉపాధ్యాయులు టి వెంకటేశ్వరరావులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె నారాయణరావు, జిల్లా పరీక్షల బోర్డు కార్యదర్శి డి ప్రసాదరావు, జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, సైన్స్ కో-ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్, రామకోటిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలుట్లకు పోయేదెట్లా

(మొదటిపేజీ తరువాయి)

పంటలకు నీరు పెట్టుకుంటున్నారు. పత్తి, మిర్చి తదితర పంటలను పండిస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో పంటలకు ఎరువులు తీసుకెళ్లాలన్నా, పండించిన పంటను విక్రయించుకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో రేషన్ బియ్యం పాలుట్లకు తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పాలుట్లలో గృహాలు నిర్మించుకునే వారు సిమెంటు, ఇనుము, ఇసుక, ఇతర సామాగ్రిని యర్రగొండపాలెం నుంచి పాలుట్లకు తరలించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. 12 ఏళ్ల క్రితం రోడ్డు నిర్మిస్తామని ఆశ పెట్టిన పాలకులు ఇప్పటి వరకు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పాలుట్ల గిరిజన గూడెంనకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని పాలుట్ల గిరిజనులు కోరుతున్నారు.

సర్వే చేసినా అనుమతులు రాలేదు

చెవుల అంజయ్య, మాజీ సర్పంచి, వెంకటాద్రిపాలెం




పాలుట్ల గిరిజన గూడెం వెళ్లాలంటే గంజివారిపల్లి నుంచి 38 కిమీ దూరం దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ప్రయాణం చేయాల్సి ఉంది. రోడ్డు సౌకర్యం కల్పించాలని గత 20 సంవత్సరాలుగా కోరుతున్నాం. ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నాం. 2013 సంవత్సరంలో రూ. 5 లక్షలు ఖర్చు చేసి సర్వే చేశారు. అయితే అటవీ శాఖ అనుమతులు లేక రోడ్డు నిర్మాణం జరగలేదు.

కనీసం మట్టి రోడ్డు అయినా నిర్మించాలి

నిమ్మల ఈదన్న, విటిడిఏ ప్రెసిడెంట్, పాలుట్ల



రోడ్డు సౌకర్యం లేని కారణంగా కొండలు, గుట్టలు ఎక్కుతూ, దిగుతూ సుమారు పది గంటలు పాటు నడిచి వెళ్లాల్సి వస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడక తప్పడం లేదు. పాలుట్ల గిరిజన గూడెంలో పండించిన పంటలు విక్రయించుకునేందుకు, ఆపద సమయంలో యర్రగొండపాలెం, దోర్నాల ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలి వెళ్లేందుకు కనీసం మట్టి రోడ్డు అయినా నిర్మించాలి.



వసూలు చేసిన నగదును ఎమ్మెల్యే బీఎన్‌కు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరద బాధితుల కోసం సాయం అందజేత

ప్రజాశక్తి-సంతనూతలపాడు

వరద బాధితులకు సహాయార్థం మండలంలోని మంగమూరు గ్రామ టిడిపి నేతలు అబ్బూరి శ్రీనివాసరావు, నల్లూరి నారాయణ రావు ఆధ్వర్యంలో దాతల నుంచి వసూలు చేసిన రూ.1,11,100ను సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్‌కు సోమవారం ఒంగోలులోని ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్బూరి చిన్న శ్రీనివాసరావు, నల్లూరి కిషోర్, కే రాజు, పీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

దళిత గిరిజనుల అభివృద్ధికి సహకరించండి

బాపట్ల ఎంపీకి బడ్జెట్ వాచ్ వినతి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్లో దళితులకు తగిన ప్రాధాన్యతను ఇచ్చి నిధుల కేటాయింపు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా సభ్యులు బాపట్ల పార్లమెంటు సభ్యులు టి కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ల కోసం 12 వేల సీట్లు అందుబాటులో ఉండగా, 39,000 దరఖాస్తులు ప్రతి సంవత్సరం వస్తున్నాయి. అంటే 27,000 మంది విద్యార్థులు గురుకులాల్లో చదువుకునే అవకాశం ప్రతి సంవత్సరం కోల్పోతున్నారని, వీరిలో బాలికలు డ్రాప్ అవుట్స్‌గా మిగిలిపోతున్నారన్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి సంవత్సరం 20 కొత్త గురుకుల పాఠశాలలను నిర్మించి వాటికి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలని, ప్రతి జిల్లాలో ఎస్సీ ఎస్టీ విద్యార్థుల కోసం ఒక బాలుర, ఒక బాలిక రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల నిర్మించి, అందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, మరి ముఖ్యంగా బాపట్ల లాంటి నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో విద్యార్థుల సంఖ్యకు అవసరాలకు అనుగుణంగా తగిన నూతన విద్యా సంస్థల ఏర్పాటుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించే స్వయం ఉపాధి పథకంలో ఎన్ఎస్ఎఫ్‌డిసి, అనేక సంక్షేమ పథకాలను పున్ణ ప్రారంభించి అమల్లోకి తీసుకోరావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు తీరును ఎస్‌సిఆర్‌డి 20-21 నివేదికను పరిశీలిస్తే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండుసార్లు జనవరి, జూలై నెలలో ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ సభ్యులు స్పందిస్తూ దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. వినతి పత్రంలోని అంశాలు ఎంతో అధ్యయనం చేసి పేర్కొన్నవిగా ఉన్నాయని, వాటిపట్ల తాను కచ్చితంగా తగిన వేదికలలో మాట్లాడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్



బాపట్ల ఎంపి కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న దళిత గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా సభ్యులు

దేవరపల్లి డేవిడ్ రాజు, కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు గుమ్మడి ఏసురత్నం, నల్లమాల తిరుపతిరావు, సలగల చంటి, పొందుగల ప్రసాదరావు, శ్రీలత భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ముసి నదికి సాగర్ నీటి కోసం ఉద్యమం

- 25న కొండపిలో సదస్సు
- రైతు, వ్యవసాయ కార్మిక రైతు కూలీ సంఘాల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు

ప్రజాశక్తి-కొండపి

ముసి నదికి సాగర్ నీరు సాధించేందుకు ఉద్యమించాలని రైతు, వ్యవసాయ కార్మిక రైతు కూలీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. కొండపిలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ముసి పరివాహక ప్రాంతాల రైతులు, రైతు కూలీల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కేజీ మస్తాన్, రైతు సంఘం నాయకులు ఆర్.లక్ష్మి అధ్యక్షత వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శులు పమిడి వెంకట్రావు, కె.వీరారెడ్డిలు మాట్లాడుతూ దేశమంతా వరద ఉప్పొంగి వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే కొండపి ప్రాంతంలో తాగటానికి నీళ్లు కూడా లేకపోవడం విచారకరమని అన్నారు. కొండపి ప్రాంతమే కాదు మొత్తం మన జిల్లా అంతా ప్రధానంగా వర్షాధార పంటలే పండుతున్నాయని అన్నారు. తగిన నీటి ప్రాజెక్టులు లేక, నీటి వనరులను నిలబెట్టే ప్రయత్నం తగిన స్థాయిలో జరగక నేటికీ కరువు జిల్లాగా కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముసికి సాగర్ నీరు సాధన కోసం అనేక ఉద్యమాలు సాగాయని ఆ ఒరవడితోనే నేడు కూడా మరొక ఉద్యమం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రైతు కూలీ సంఘం నాయకులు పరిటాల కోటేశ్వరరావు, వై.నాగరాజు మాట్లాడుతూ ముసికి శాశ్వతంగా ఒక టీఎంసీ నీరు లభించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి చేసి సాధించాలని అన్నారు. రబీ సీజన్ ప్రారంభమవుతుందన్నారు. ముసి పరివాహక ప్రాంతంలో ఉన్న అన్ని గ్రామాల రైతులు రైతుకూలీలను కదిలించి ఉద్యమం చేపట్టాలని వారు పిలుపునిచ్చారు. పెరిదేపి గ్రామానికి చెందిన రావిపాటి వెంకట్రావు, కొల్లూరి బాలయ్యలు మాట్లాడుతూ ముసికి సాగర్ నీటి సాధన కోసం జరిగే ఉద్యమంలో తాము ప్రధాన పాత్ర పోషిస్తామని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె.జయంత్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు కొండపిలో జరిగే ముసి పరివాహక ప్రాంత ప్రజల సదస్సుకు అధిక సంఖ్యలో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాలకు, గ్రామాలకు చెందిన నాయకులు ముప్పరాజు చెంచయ్య, వేజెండ్ల సింగయ్య, ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, పుట్టా రామారావు, మద్దినేని సురేష్, జి.వందనం, కోటపాటి రమణయ్య, ఎం.వెంకటేశ్వర్లు, గుల్లపల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కత్తులతో దాడి చేసి హత్య



గాయాలతో వున్న ఏసుబాబు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేయగా సంఘటనా స్థలంలోనే వ్యక్తి మృతి చెందిన ఘటన బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరం వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణా జిల్లాకు చెందిన ఏసుబాబు కొన్ని సంవత్సరాలుగా బాపట్లలోనే స్థిరపడి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో సూర్యలంకకు వెళ్ళిన ఏసుబాబుపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ఏసుబాబుపై కత్తులతో దాడి జరిగిన అనంతరం సుమారు అరగంటసేపు సూర్యలంక సముద్ర తీరం వద్ద ఉన్న షాపుల వద్ద కొనఊపిరితో ఉన్నాడు. ఆ సమయంలో 108 లేదా ఏదైనా వాహనం ద్వారా అయిన వైద్యశాలకు తీసుకువెళ్లి ఉంటే బతికి ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. హత్యకు పాల్పడిన వారు ఎవరు? ఇందుకు దారితీసిన కారణాలు ఏమిటనేది వెల్లడి కాలేదు. బాపట్ల రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో 13 మంది ఎస్ఐలు బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పి దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని 13 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పి ఏఆర్ దామోదర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లా విఆర్ (వేకెన్సీ రిజర్వ్)లో ఉన్న 8 మంది నలుగురు ఎస్ఐలకు పోస్టింగ్‌లు లభించాయి. విధులలో ఉన్న ముగ్గురు ఎస్సైలను డిస్ట్రిక్ విఆర్‌కు పంపటం గమనార్హం. బదిలీ అయిన ఎస్ఐలు వెంటనే విధులలో చేరాలని జిల్లా ఎస్పి ఉత్తర్వులలో పేర్కొన్నారు.

ఎస్ఐ పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
టి.త్యాగరాజు	కనిగిరి	జిల్లా విఆర్
టి.శ్రీరామ్	జిల్లా విఆర్	కనిగిరి
పి.శివ నాగరాజు	హెచ్ఎంపాడు	జిల్లా విఆర్
కె.మాధవ్ రావు	జిల్లా విఆర్	హెచ్ఎంపాడు
జి.కోటయ్య	జిల్లా విఆర్	పిసిపల్లి
టి.కిషోర్ బాబు	ఒంగోలు వన్‌టౌన్	పామూరు
బి.ప్రేమ్‌కుమార్	సిఎస్‌పురం	జిల్లా విఆర్
ఆర్.సుమన్	జిల్లా విఆర్	సిఎస్‌పురం
కె.మధుసూదన్ రావు	కొమరోలు	వెలిగండ్ల
ఎం.వెంకటేశ్వర్లు నాయక్	జిల్లా విఆర్	కొమరోలు
టి.రాజ్‌కుమార్	జిల్లా విఆర్	కె.కె.మిట్ల
బి.బ్రహ్మనాయుడు	జిల్లా విఆర్	తర్లుపాడు
పి.రాజేష్	జిల్లా విఆర్	పుల్లలచెరువు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

వైసీపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి



అశోక్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-శింగరాయకొండ

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదని వైసీపీ రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రారంభించడం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం పేద, మధ్యతరగతి వారికి నష్టమన్నారు. నిర్ణయాన్ని పునరాలోచించుకొని పాత విధానాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. ప్రభుత్వ విధాన నిర్ణయం లోపం వల్ల ఈ సంవత్సరం విద్యార్థులు 750 ప్రభుత్వ సీట్లను కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. వైఎస్సార్ హయాంలో నాలుగు ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు స్థాపించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

పాకల పల్లిపాలెంలో పూరిల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన ఇల్లు

రూ.50వేల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల పల్లిపాలెంలో సోమవారం సాయంత్రం పూరిల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మోపి లక్ష్మీదేవికి చెందిన పూరింట్లో మంటలు రావడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. వెంటనే అప్రమత్తమయి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ రూ.50 వేల రూపాయలు విలువచేసే వస్తువులు పూర్తిగా కాలిపోయినట్లు బాధితురాలు లక్ష్మీదేవి తెలిపారు. ఘటన స్థలాన్ని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కృష్ణ, పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, తెలుగు యువత జిల్లా నాయకులు కన్నా శ్యాంప్రసాద్ సందర్శించి పార్టీ నుంచి పూర్తిగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మంత్రి స్వామికి వివరించి ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ మోసాల పట్ల అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-పుల్లలచెరువు

మండలంలోని యండ్రపల్లి, కొమరోలు గ్రామాలలో సోమవారం సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో సిఎఫ్‌సి పి.గురవయ్య ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ పే, గూగుల్ పే, ఆధార్ కార్డు ఓటిపి ద్వారా ఆన్‌లైన్ మోసాలు జరుగుతుంటాయన్నారు. అలాగే బాల బాలికలు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి డబ్బులు పోగొట్టుకొని మోసపోతుంటారని చెప్పారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసపోకుండా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- రాచర్ల

రాచర్ల మండలం రాచర్ల ఫారం గ్రామ సమీపంలో సోమవారం అక్రమంగా మద్యం తరలిస్తున్న జేపీ చెరువు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని రాచర్ల ఎస్ఐ కోటేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. అతడి నుండి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని యడవల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.1,650 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు జరిగితే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు.

టీడీపీ నాయకుల మధ్య ఫ్లెక్సీల రగడ

ఎమ్మెల్యే బిఎన్ జన్మదినం సందర్భంగా బహిర్గతమైన వైనం

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల టిడిపిలో ఫ్లెక్సీల రగడ రాజుకుంది. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా మండల టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నేషనల్ హైవే పక్కన పెద్దకొత్తపల్లి గ్రామానికి ఎంట్రన్స్‌లో ముందుగా ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలలో ప్రస్తుత మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు ఫోటో వేయలేదని ఆయన, ఆయన వర్గీయులు ఫ్లెక్సీలను సోమవారం చించివేశారు. ఇప్పుడు ఈ విషయం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ఆటోను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడుపుతూ మహిళలని ఢీకొట్టిన ఘటనలో ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండలంలోని గణేశునిపల్లి గ్రామానికి చెందిన కవులూరి మస్తానమ్మ, ఆమె బంధువులతో కలిసి ఏ.కొత్తపల్లి రోడ్డులో 14 తేదీ సాయంత్రం వాకింగుకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గణేశునిపల్లి సమీపంలో వెనుక నుంచి ఆటో నడుపుకుంటూ వస్తున్న పోకల సుధాకర్ అనే వ్యక్తి తన ఆటోతో ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలు ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి మద్దిపాడు

పేకాట స్థావరం పై దాడి చేసి నలుగురుని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివ రామయ్య తెలిపారు. మండల పరిధిలోని కొలచనకోటలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుండి నాలుగు సెల్ ఫోన్లు, రూ.720 నగదు సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వరద బాధితులకు దోర్నాల టౌన్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సువార్తికులు చాట్ల గంగయ్య, చాట్ల రాజు, సింగా రాజేష్‌లు బియ్యం, కిరాణా సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సువార్తికులు పాల్గొన్నారు.

'అభయ యాప్' ద్వారా వైద్య సేవలు

ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా



డాక్టర్ యాదిద్య

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అభయ యాప్ ద్వారా యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ఓపి విభాగంలో నూతన విధానానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ దేవర యదిద్యా సోమవారం తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషంట్ రోగుల కోసం క్యూఆర్ విధానాన్ని వైద్య ఆరోగ్యశాఖ నూతనంగా అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు అభయ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌లో యాండ్రాయిడ్ మొబైల్ ద్వారా స్కాన్ చేసుకోవాలన్నారు. అందులో సంబంధిత రోగి వివరాలు నమోదవుతాయని చెప్పారు. నమోదైన ఆ వివరాలు వైద్య విభాగానికి వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మెరుగైన సేవలు ప్రజలకు అందజేయడానికి పూర్తిస్థాయిలో కషి చేస్తున్నామని తెలిపారు.

శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలి

ఐద్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని కిష్కిందపాలెంలో లంక గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సన్నాహక సదస్సు ఏర్పాటు చేయాలని ఐద్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి కోరారు. సదస్సుకు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట రామయ్య అధ్యక్షత వహించారు. ఆమె తోపాటు రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ మాట్లాడారు. రైతుల అభిప్రాయాలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తాను 1989లో లంక గ్రామాలకు వచ్చానని, రైతుల కష్టాలు తనకు తెలుసని అన్నారు. కృష్ణా జిల్లాలో ఉండే కొల్లూరు మండలాన్ని గుంటూరు జిల్లా కలిపినప్పుడు దీనికి డ్రైనేజీ వ్యవస్థ లేదని అన్నారు. అప్పుడు వ్యవసాయ మోటార్లకు కరెంటు కూడా లేదని అన్నారు. అలాంటి సమయంలో తిప్పలకట్ట గ్రామం నుండి అనేక మంది రైతులు వలస వెళ్లారని తెలిపారు. ఆ తరువాత పోతర్లం కాలువ వచ్చిన తరువాత నీరు వచ్చి కొంత వరకు రైతులకు ఉపయోగ పడిందని, తరువాత పైపులైన్లు స్కీం వచ్చిందని అన్నారు. దీనిని రూ.50కోట్లతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఆయా ప్రాంతాలకు నీరు వెళ్లడం లేదని అన్నారు. మొన్న కృష్ణా నదికి వచ్చిన వరద గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈ వరద వలన వాణిజ్య పంటలు, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన 2010లో డ్రైనేజీ, ఇరిగేషన్ అధికారులు తయారు చేసిన డిపిఆర్ రిపోర్టు అమలు కోసం అధికారులు, ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ డ్రైనేజీ సమస్య పరిష్కారం కొరకు 2010లో వెల్లటూరులో నిరాహార దీక్ష చేసినట్లు గుర్తు చేశారు. అప్పట్లో లంక గ్రామాల్లో సర్వే చేసి ఒక రిపోర్ట్ తయారు చేసినప్పటికీ నేటికీ అమలు కాలేదని అన్నారు. ఇప్పటికైన ఆ రిపోర్టు ఆధారం చేసుకుని పోతర్లంక నుండి పెసర్లంక వరకు శాశ్వత డ్రైనేజీ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జొన్న శివశంకర్ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి లాకుల సిస్టంకు ఇప్పుడున్న సిస్టంకు చాలా తేడా ఉందని అన్నారు. కాలవలకు డ్రైనేజీ వ్యవస్థకు ఎన్ని క్యూసిక్కులు నీరు సముద్రంలో కలుస్తుందనే లెక్కుండేదని అన్నారు. ఇప్పుడు అలాంటిదేమీ లేదని అన్నారు. 1960 నుండి 2024 వరకు ఈ 60ఏళ్ల నుంచి తాము చూస్తున్నామని, ఋతువుల మార్పుతోపాటు వాతావరణంలోనూ మార్పులు వచ్చాయని అన్నారు. కొన్నిచోట్ల భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయని అన్నారు. దీంతో వ్యవసాయ బోర్లు కూడా పనిచేయడం లేదని అన్నారు. వ్యవసాయానికే కాక ప్రజలకు మంచినీళ్లు కూడా అందని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అలాంటి ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. గతంలో తెనాలి డివిజన్‌కు 218 మంది లస్కర్లుంటే ఇప్పుడు కేవలం 38 మంది ఉన్నారని అన్నారు. రైతులందరూ పార్టీలకు అతీతంగా సమిష్టిగా కృషిచేసి డ్రైనేజీ వ్యవస్థను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామస్వామి, తోకలవాని పాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్, ప్రజా సంఘాల నాయకులు బిఎల్‌కె ప్రసాద్, పి మనోజ్, నాగరాజు, బి సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, రైతులు శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి


ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కు అందజేస్తున్న ప్రతినిధులు

అన్నా క్యాంటీన్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చీరాల

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్‌కు దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి సేవాభావంతో విరాళం ఇస్తున్న వారి సేవలు అభినందనీయమని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. స్థానిక ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో అన్న క్యాంటీన్ నిర్వహణకు చీరాల బులియన్ జ్యువెలరీ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.1లక్ష చెక్కును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవాభావంతో అసోసియేషన్ ప్రతినిధులు అన్నా క్యాంటిన్‌కు చేయూత అందించటం హర్షనీయం అన్నారు. పేదల ఆకలి తీరుస్తున్న అన్నా క్యాంటీన్ నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ టివి సురేష్ బాబు, సెక్రెటరీ వర్ణికల నాగేశ్వరరావు, ట్రెజరర్ బి స్వామి, జాయింట్ సెక్రెటరీ ఊటుకూరు సత్యనారాయణ, గుడిమెట్ల కృష్ణమోహన్, రామకృష్ణ, వాసు పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందజేస్తున్న ఉద్యోగులు

గ్రామస్తులకు అండగా ఉద్యోగులు

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని తోకలవారిపాలెం గ్రామానికి చెందిన ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగులు అందరూ కలిసి ఊరికి ఎంతో కొంత మేలు చేయాలన్న ఉద్దేశంతో వంట నూనె, కంది పప్పు, పేస్టు, సబ్బులు, గోధుమ రవ్వ, గోధుమ పిండి, దుప్పటి, చీర, టవల్, లుంగీ, సాల్ట్ తదితర 15రకాల నిత్యవసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో పుట్టి పెరిగి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ సొంత ఊరు మీద మమకారంతో ఇవన్ని చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో గ్రామాన్ని ఆదుకోవడానికి తామం దరం సంసిద్ధంగా ఉంటామని గ్రామస్తులకు బరోసా ఇచ్చారు. సభకు సర్పంచ్ టి కృష్ణ మోహన్ అధ్యక్షత వహించారు. బ్యాంకు ఉద్యోగులు అనిల్ కుమార్, వర్రె పూర్ణచంద్రరావు, వాగోలు పోతురాజు, వర్రె రంజిత్, అంబటి కిరణ్, వాగోలు సాగర్, ఎడ్ల శ్రీనివాస రావు, చలపతిరావు, దేశం రాజు, వర్రె అనిత, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


అన్నదానం నిర్వహిస్తున్న జనసేన కార్యకర్తలు

జనసేన ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

జనసేన సీనియర్ నాయకులు మన్నెం శ్రీకాంత్ జన్మదిన వేడుకలు పర్చూరులో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీకి చెందిన నాయకులు కారంపూడి సందీప్ తేజ ఆధ్వర్యంలో స్థానిక బొమ్మల సెంటర్లో కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేకును అభిమానులు ఒకరి కొకరు పంచుకున్నారు. అనంతరం శ్రీకాంత్ జన్మదిన సందర్భంగా డొక్కా సీతమ్మ పేరుతో 600మందికి పైగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో కె సందీప్ తేజ, రంగిశెట్టి ఆంజనేయులు, తోట మణి, ఆర్ రామాంజనేయులు, ఎస్‌కె మస్తాన్, ఎ సతీష్, డి సాంబయ్య పాల్గొన్నారు.

12వ వేతన కమిటీ నివేదిక బయట పెట్టాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర ప్రభుత్వం 12వ వేతన కమిటీ రిపోర్టును బయటపెట్టి అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సిపిఎం మధ్యతరగతి శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇవ్వవలసిన వేతన, అలవెన్స్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. చీరాల ట్రెజరీ ఆఫీసులో అధికారులపై వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అవినీతిపరులైె అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులు సకాలంలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మహాసభకు ఐవీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. సభలో సిపిఎం చీరాల కార్యదర్శి ఎన్ బాబురావు, డి నారపరెడ్డి, బి అజయ్, కె యల్లమంద పాల్గొన్నారు. నూతన కార్యదర్శిగా బి అజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


నిత్యావసరాలు అందజేస్తున్న సుధీర్‌కుమార్

వీరే మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సహాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన లంక గ్రామమైన పెదలంకలో 250 కుటుంబాలకు దుస్తులు, నిత్యవసర సరుకులను వీరే మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ కె సుధీర్ కుమార్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లూరు మండలంలోని తిప్పలకట్ట గ్రామంలో 450 కుటుంబాలకు దుస్తులు, నిత్యవసర సరుకులు అందజేసినట్లు తెలిపారు. భట్టిప్రోలు పెదలంకలో 250 కుటుం బాలకు అందజేసి నట్లు తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయటంలో వీరే మినిస్ట్రీస్ ముందంజలో ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు పి ప్రకాష్, సంజీవరావు, వీరే మినిస్ట్రీస్ బృందం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎజిపి యరమోతు రమేష్‌బాబు

రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి - అద్దంకి

రక్తదానం అన్ని దానాలలో కంటే అత్యున్నత మైనదని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అన్నారు. రక్త హీనతతో బాధ పడుతున్న గోపాలపురం గ్రామానికి చెందిన కోయి లక్ష్మికి రక్తం అత్యవసరంగా వైద్యుల సూచన మేరకు వారి బంధువులు రోటరీ కార్యదర్శి రక్తదాన విభాగ డైరెక్టర్ చుండూరి మురళీసుధాకర రావును సంప్రదించారు. ఎజిపి రొటేరియన్ యరమోతు రమేష్‌ను ప్రోత్చహించి అతనితో రక్తదానం చేయించారు. తన ప్రోత్సాహంతో 432వ రక్తదానం చేసినట్లు మురళీసుధాకరరావు తెలిపారు. రక్త దాతతోపాటు మురళీసుధాకరరావును రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు. కార్యక్రమంలో ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి :ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చీరాల

దళిత, గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంఎల్ఎ కొండయ్య అన్నారు. దళిత, గిరిజన బడ్జెట్ వాచ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో త్వరలో ప్రవేశ పెట్టనున్న బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ కంపోనెంట్ కింద వివిధ పథకాలకు నిధుల కేటాయింపుకు కృషి చేయాలని కోరుతూ వివిధ ప్రజాసంఘాల నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రజల అవసరాలకు అనుగుణంగా నూతన ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించే విధంగా నూతన గురుకుల పాఠశాలలు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వం రద్దు చేసిన దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని మార్పులు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. సఫాయి కర్మచారి, గిరిజనులు డీ - నోటిఫైడ్ ట్రైబ్స్, డిఎన్టిలకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన పేద దళిత, గిరిజనులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. దళిత, గిరిజన వార్డులకు స్మశాన స్థలాలు కేటాయింపులకు నిధులు విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో బడ్జెట్ వాచ్ జిల్లా చైర్మన్ దేవరపల్లి డేవిడ్ రాజ్, కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు, దళిత బహుజన రిసోర్స్ సెంటర్ చీరాల, బాపట్ల ఏరియా కో-ఆర్డినేటర్ ఎన్ భగవాన్‌దాస్, శ్రీలత, గుమ్మడి ఏసురత్నం, ఎన్ లక్ష్మీ నరసయ్య, పార్లమెంట్ అధ్యక్షులు నల్లమాల తిరుపతిరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కొండయ్యకు వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

కార్పెంటర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద శిక్షణ పొందిన కార్పెంటర్లకు ధ్రువీకరణ పత్రాలు సోమవారం అందజేశారు. మండలంలోని వెల్లటూరులో గత సోమవారం నుండి శనివారం వరకు జరిగిన శిక్షణ తరగతి అనంతరం వృత్తి ధృవీకరణ పత్రాలు అందజేసినట్లు కార్పెంటర అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడూరు వెంకటేశ్వరరావు తెలిపారు. సెంటర్ మేనేజర్ కోటి స్పందన దేవి వృత్తి నైపుణ్యంపై కార్పెంటర్లకు శిక్షణ ఇవ్వటం అభినందనీయమని అన్నారు. ఈ మేరకు వెంకటేశ్వరరావుతోపాటు స్పందన దేవి చేతుల మీదగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.


కార్పెంటర్ల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నాయకులు

సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజాపోరాట యోధుడు, కార్మికఉద్యమ నేత కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాపసభ సిఐటియు బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్రకార్యదర్శి కె.ధనలక్ష్మి ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి నిరంతరం శ్రమిస్తూ కార్మికులు,కర్షకుల శ్రేయస్సే జీవితలక్ష్యంగా శ్రమించిన నేత సీతారాం ఏచూరి అని తెలిపారు. విద్యార్థి దశ ఉద్యమాల నుంచి చారిత్రాత్మకమైన రైతాంగ నల్లచట్టాలు రద్దు వరకు,దేశంలో మతోన్మాదశక్తులు కార్మికులు,ప్రజల మధ్య విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పి కొట్టేందుకు సీతారాం ఏచూరి ఎనలేని కషిచేశారని తెలిపారు. ఏచూరి మరణం కార్మిక, కర్షకులు, విద్యార్థి యువజన లోకానికి తీరని లోటని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు



బాపట్లలో నివాళులర్పిస్తున్న నాయకులు



టంగుటూరులో నివాళులర్పిస్తున్న నాయకులు



మార్కాపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సిహెచ్.మణిలాల్ జిల్లా కార్యదర్శి సిహెచ్. మజీదుబాద్, కె.వసంతరావు, తిరుపతిరెడ్డి, కె.శరత్ బాబు, జి.సుధాకర్, ఎం.వెంకటేశ్వరమ్మ, వీరాంజనేయులు, శ్రీనివాస్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం : కడ వరకూ ప్రజల పక్షాన నిలిచిన మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం. రఫి కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్ర పటానికి పూలాభిషేకంతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ ఎందరో జన్మిస్తారని, కొందరు మాత్రమే ప్రజల కోసం జీవిస్తారని, అలాంటి వారిలో ఏచూరి ఒకరన్నారు. ఏచూరి పార్థివ దేహాన్ని వైద్య పరిశోధనల కోసం అప్పగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు కె.సుబ్బరాయుడు, జి. హరి, సలాంఖాన్, ఇమాంషా, చెన్నకేశవులు, అల్లూరయ్య, రషీద్, తటవర్తి గురునాథం, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు : మండల పరిధిలోని కొణిజేడు గ్రామంలో సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం గ్రామ కార్యదర్శి షేక్ మీరాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ వి.మోజెస్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మోజెస్ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం సిపిఎంలో చేరిన ఏచూరి తుదిశ్వాస వరకూ అదే పార్టీలో కొనసాగిన మహోన్నత వ్యక్తిత్వం ఆయనది అని కొనియాడారు. ఏచూరి ఆశయాల కోసం నిరంతం రాజీ లేని పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.కోటయ్య, టి.రామకోటయ్య, మక్కెన శ్రీనివాసరావు, తన్నీరు రామారావు, కొమ్ము ప్రభుదాసు, గుంటు దాసు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి యాదాల అశోక్ రాజీనామా

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

వైసిపికి, వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మాజీ రాష్ట్ర ఆరోగ్య శ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ చెప్పారు. తన భార్య, నాగులుప్పలపాడు జడ్‌పిటిసి డాక్టర్ రత్నభారతితో కలిసి సోమవారం ఒంగోలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీలో భారీగా అవినీతి జరిగిందని ఆరోపించారు. అవినీతి వెనుక వైసిపిలో మంత్రులు, పెద్దలు ఉన్నారని వివరించారు. అప్పటి హెల్త్ మినిస్టర్ విడదల రజని, అప్పటి హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు, అప్పటి ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ హరికృష్ణ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ మాటున పెద్ద ఆసుపత్రుల్లోని నిధులను వైసిపిలోని అగ్రవర్ణాల వారు దోచుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో ఆరోగ్యశ్రీ స్పెషలాఫీసర్‌గా ఉండి తాను కొన్ని అక్రమాలను బయటపెడితే వాటి గురించి ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష రావడానికి తానే కారణమని చెప్పారు. వైసిపి దళిత ద్రోహుల పార్టీ అని విమర్శించారు. ఆరోగ్య స్పెషలాఫీసర్‌గా తాను ఎక్కడైనా ఒక్క రూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తాము ఎక్కడ కొనసాగాలి అనే విషయం కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. నాగులుప్ప లపాడు జడ్‌పిటిసి డాక్టర్ రత్నభారతి మాట్లాడుతూ జడ్‌పిటిసిగా తాను ఏ ఒక్క గ్రామానికి న్యాయం చేయలేక పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాను పనులు ప్రతిపాదిస్తే ఆపనులను ఎమ్మెల్యే అడ్డుకున్నట్లు తెలిపారు. గత ఎన్నికల్లో సంతనూతలపాడు నుంచి వైసిపి తరుపున పోటీ చేసిన మేరుగ నాగార్జున కూడా తనకు తగిన గుర్తింపు ఇవ్వలేదన్నారు. పార్టీలో అవమానాలు పడేకంటే పక్కన ఉండటమే మంచిదని తాను పార్టీ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

మంజూరు ఒక చోట..తరగతులు మరో చోట..

ఇదీ మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల తీరు తెన్నూ..

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సౌమ్యోకడిది సోకొకడిది అన్న చందంగా ఉంది జ్యోతిరావు పూలే పాఠశాల పరిస్థితి. యర్రగొండపాలెం నియోజకవర్గం లోని పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం పాఠశాలను మంజూరు చేశారు. దీన్ని మార్కాపురం పట్టణానికి సమీపంలోని దరిమడుగు గ్రామంలో ఏర్పాటు చేశారు. దీంతో నియోజకవర్గంలోని పేద విద్యార్థులు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న దర్శి, కురిచేడు, ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్నారు. వెనుక బడిన పేద విద్యార్థులు సంక్షేమం కోసం అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా 65 మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలను మంజూరు చేశారు. అప్పటి యర్రగొండపాలెం ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్‌రాజు యర్రగొండపాలెం నియోజకవర్గానికి పాఠశాలను మంజూరు చేయించారు.

2018లో...

2018 డిసెంబర్ 31న అప్పటి ఎమ్మెల్యే డేవిడ్‌రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కళింగరాజు పాఠశాలను ప్రారంభించినారు. తరగతి గదుల వసతులు, నీటి వసతులు లేకపోవడంతో పాఠశాలను మార్కాపురం దగ్గరలోని



పాఠశాలకు కేటాయించిన స్థలం ఇదే

దరిమడుగు గ్రామంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 300 మంది విద్యార్థులకు బాత్రుములు, లెట్రిన్, నీటి వసతి సరిపడక చాలా ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలను ప్రారంభించిన నాటి నుండి గుత్తేదారునికి నెలకు రూ. 20 వేల వంతున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇటీవల సంబంధిత అధికారులు పాఠశాలను సందర్శించి పాఠశాలను జూనియర్ కాలేజిగా ఉన్నతీకరణ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పాఠశాలలో తరగతి గదులు సరిపోక పోవడంతో మార్కాపురం పట్టణంలో పాఠశాల మరియు జూనియర్ కాలేజికి అద్దె భవనం కోసం అన్వేషిస్తున్నారు.

డేవిడ్‌రాజు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో..

పాలపర్తి డేవిడ్ రాజు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పాఠశాల కోసం త్రిపురాంతకం మండలంలోని దూపాడు గ్రామ రెవెన్యూ పరిధిలోని కేశినేనిపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 1233లో 12 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నాటి నుంచి నేటి వరకు ప్రజాప్రతినిధులు దీని గురించి పట్టించుకున్న పాపానపోలేదు ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది మార్కాపురం పరిసర ప్రాంతాల వారు కావడంతో వారికి అందుబాటులో ఉంటుందని వారు పెద్దగా పట్టించుకోవటం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పేరుకు మాత్రమే యర్రగొండపాలెం పాఠశాల ఇక్కడ కంభం, మార్కాపురం, బేస్తవారిపేట మండలాల విద్యార్థులే చదువుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గ విద్యార్థులు, యరగొండపాలెం ప్రాంత ప్రజలకు ఈ పాఠశాల ఎక్కడ ఉన్నదో కూడా తెలియని దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా నూతన ప్రభుత్వం స్పందించి పాఠశాల నిర్మాణానికి గతంలో మంజూరు చేసిన ప్రాంతంలో శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని చిన్నారుల తల్లిదండ్రులు, కేశినేనిపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నూనె అంకమ్మరావుకు పడవల లక్ష్మణస్వామి పురస్కారం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ఒంగోలుకు చెందిన ప్రముఖ సాహితీవేత్త, ప్రకాశం జిల్లా రచయితల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మ రావు చేస్తున్న సాహిత్య కృషిని గుర్తించి ఈ ఏడాది పడవల లక్ష్మణస్వామి స్మారక స్ఫూర్తి పురస్కారం -2024 కు ఆయన్ని ఎంపిక చేసినట్లు సహజ సాహితి సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు పడవలి రాధాకృష్ణ, పురస్కార ప్రదాత పివిఆర్. ప్రసాద్ తెలిపారు. పురస్కారం, నగదు బహుమతిని ఈనెల 22న చీరాల రోటరీ క్లబ్ సమావేశమందిరంలో నిర్వహిస్తున్న సాహిత్య సభలో ప్రముఖుల చేతుల మీదుగా ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు. పురస్కారానికి ఎంపికైన అంకమ్మరావుకు నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు ,మిడసల మల్లికార్జునరావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, యువి.రత్నం, కె.బాలకోటయ్య, నవ్యాంధ్ర రచయితల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కోశాధికారి బీరం అరుణ, కళామిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి అభినందనలు తెలిపారు.

లైసెన్సులు తీసుకునేలా చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి దినపత్రికలో ఈ నెల 15న నకిలీల దెబ్బ అనే శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా ఉద్యాన అధికారి గోపిచంద్ స్పందించారు. మిరప నారు కావాల్సి రైతులు ఉద్యాన శాఖ ద్వారా లైసెన్సులు పొందిన నర్సరీలలో కొనుగోలు చేయాలన్నారు. నారు పెంపకంతో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటికప్పుడు చేసే తనిఖీల్లో యజమానులకు సూచనలు ఇచ్చేలా ఆదేశించామన్నారు. ఉద్యానశాఖ అధి కారుల నుంచి నర్సరీల నిర్వాహకులు లైసెన్సులు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యాన పంటల రైతులకు ప్రోత్సాహమేదీ..!

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల మొక్కల సాగుకు సిద్ధం చేసింది. దీంతో రైతులు కూడా ఉద్యాన పంటలైన బత్తాయి, బొప్పాయి, నిమ్మ, అరటి పంటల సాగుకు ఉపక్రమించారు. 2020-21లో కడియం ప్రాంతం నుంచి మొక్కలు తెచ్చి పొలంలో నాటారు. గుంతలు తీసిన నాటి నుంచి మొక్కలు నాటినందుకు, నీళ్లు పోసి పెంచినందుకు వివిధ స్థాయిలను బట్టి రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారు. బత్తాయికి మూడేళ్ల వరకు ఎకరాకు రూ. ఆరు వేలు చొప్పున, నిమ్మకు రూ. ఆరు వేలు చొప్పున, అరటికి రూ. 15 వేలు, బొప్పాయికి రూ. తొమ్మిది వేలు చొప్పున ప్రభుత్వం అందజేయాల్సి ఉంది. ఇలా మొత్తం యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో కలిపి 150 మంది రైతులకు రూ. 20 లక్షలు చెల్లించాల్సి ఉంది.

కార్యాలయం చుట్టూ తిరుగుతూ..

పండ్ల మొక్కలు సాగు చేసిన రైతులకు మొక్కల పాదులు, నీళ్లు పోసినందుకు ఏటా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు ఎకరాకు మూడేళ్ల కాలపరిమితిలో నగదు రావాల్సి ఉంది. అందులో భాగంగా కొంత మందికి పూర్తిగా చెల్లించగా, మరికొందరికి రూ. 25 వేలు మాత్రమే చెల్లించారు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్ల కాలంలో తమకు ప్రభుత్వ ప్రోత్సాహకం అందలేదని వాపోతున్నారు. నూతన ప్రభుత్వమైనా ప్రత్యేక చర్యలు తీసుకొని పండ్ల తోట రైతులకు అందించాల్సిన ప్రోత్సాహక నగదును జమ చేయాలని కోరుతున్నారు.

పంట నష్టం అంచనా పూర్తి

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల పరిధిలో పంట నష్టం అంచనా పూర్తయినట్లు వ్యవసాయ అధికారి వి లోకేశ్వరి తెలిపారు. ఖరీఫ్‌లో 25వేల ఎకరాల సాగు విస్తీర్ణం కాగా 7300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అంచనాలు వచ్చాయని తెలిపారు. లబ్ధిదారుల జాబితాను పూర్తి చేసి మంగళవారం అన్ని రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల వద్ద సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శనకు జాబితాలు ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులు ఆ జాబితాను పరిశీలించుకుని అభ్యంతరాలు ఉన్నట్లయితే తమకు తెలియజేయలని కోరారు. అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది జాబితాను బుధవారం జిల్లా కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ పంట నమోదు ప్రక్రియ కూడా జరుగుతుందని తెలిపారు. ఈ ఖరీఫ్‌కు సంబంధించి 95శాతం పంట నమోదు పూర్తయి నట్లు తెలిపారు. రైతులు ఈకెవైసీ చేయించుకోవడానికి మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లేదా వారు నేరుగా రైతు సేవ కేంద్రాలకు వచ్చి వేలిముద్ర వేసి తమ ఆధార్‌కు పంట నమోదు చేయించుకోవడం ద్వారా ఈకెవైసీ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పంట నమోదు, ఈకెవైసీ సెప్టెంబర్ 30వరకు పొడిగించినట్లు తెలిపారు. రైతులందరూ గమనించి త్వరగా తమ పంట నమోదు ఈకెవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఒకటి నుంచి స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతే సేవ పక్షోత్సవాలు సోమవారం నుండి అక్టోబర్ 1 వరకు నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిఎం బెల్లం రామమోహనరావు తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది చే గ్యారేజీ ఆవరణ నుండి బస్టాండ్ మీదుగా బంగాళా రోడ్డు వరకు ర్యాలీ జరుగుతుందని తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీ...

ప్రజాశక్తి - భట్టిప్రోలు


గాయపడ్డ వెంకటేష్

భట్టిప్రోలు గ్రామానికి చెందిన మేడూరి గిరిధర్, గౌతమ్ భట్టిప్రోలు, పెదమాల పల్లికి చెందిన మంద్రు వెంకటేష్ ఇద్దరు ఎదురెదురుగా బైకుల మీద వస్తూ బౌద్ధ స్తూపం సమీపంలో ఒకరు బైకు ఒకరు ఢీ కున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనలో గిరిధర్‌కు స్వల్ప గాయం అయ్యిందని, అందుకు గిరిధర్, గౌతం కలిసి వెంకటేష్‌ను కులం పేరుతో దూషించి, గిరిధర్ పక్కనే ఉన్న రాయితో వెంకటేష్ తలపై కొట్టినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో రక్త గాయమైనట్లు చెప్పారు. బాధితుడు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని వెంపరాల గ్రామానికి చెందిన తూమాటి కుమారి సుబ్బమ్మలకు వాళ్ళ మామ నుండి 4ఎకరాలు వ్యవసాయ భూమి సంక్రమించిందని, వారిరువురి కుటుంబ సభ్యులు ఆ వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఆ వ్యవసాయ భూమిలో మిరప పంట సాగు చేసి వ్యవసాయ పనులు చేసుకుంటున్న నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన తూమాటి రాణి, వడ్లవల్లి రాణి, వజ్రమ్మ అనేవాళ్ళు పొలంలోకి వచ్చి బూతులతో అసభ్యకరంగా తిట్టి మిరప పంటను నాశనం చేసిననట్లు పిర్యాదు అందినదని ఎస్ఐ ఖాదర్‌బాషా తెలిపారు. బాధితురాలు కుమారి, సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - అద్దంకి

ఎపి 39ఎన్‌జి 2166 నంబర్ ద్విచక్ర వాహనం మరో ద్విచక్రవానం ఎదురెదురుగా ఢీ కొన్న ఘటన స్థానిక కలవకూరు రోడ్డు బజాజ్ షో రూం దగ్గర జరిగింది. గద్దల రవికుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స కొరకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్నికి చేరుకొని పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాల ప్యాకెట్ కోసం వెళ్లి..

- ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి
- మృతుడు సిపిఐ నేత ఎ బాబురావు కుమారుడు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎ ఫణికుమార్

ప్రజాశక్తి - చీరాల

పాల ప్యాకెట్ కోసం వచ్చిన వ్యక్తిని రాంగ్ రూట్లో ద్విచక్ర వాహనంపై దూసుకు వచ్చి ఢీ కొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జాండ్రపేట అన్నపూర్ణ కళ్యాణ మండపం వద్ద సోమవారం జరిగింది. సిపిఐ చీరాల నాయకులు ఎ బాబురావు కుమారుడు అచ్యుతుని ఫణి కుమార్ (43) దేవాంగపురి పంచాయితీలోని వాసవి నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మెయింటెనెన్స్ కమిటీ మెంబర్ ఉన్నారు. అయితే ఇంట్లో పాలు లేకపోవడంతో పక్కనే ఉన్న దుకాణంకి వెళ్లి పాల ప్యాకెట్లు తీసుకుని వస్తుండగా దేశాయపేట నుండి చీరాల వైపు పల్సర్ బైక్‌పైన రాంగ్ రూట్లో వెదుళ్లపల్లికి చెందిన రవీంద్ర అనే వ్యక్తి అతివేగంతో దూసుకొచ్చి ఒక్కసారిగా ఫణి కుమార్‌ను ఢీ కొట్టాడు. అదే వేగంతో రోడ్డు వెంట టిఫిన్ దుకాణం వద్ద ఉన్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ప్రమాదానికి కారణమైన బైకు డ్రైవ్ చేస్తున్న దేవరకొండ రవీంద్ర, బైకుపై ఉన్న అక్కల శివ సుందరరెడ్డికి కుడా గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఫణికుమార్‌ను అంబులెన్స్‌లో చీరాల ఏరియా వైదశాలకు తరలించగా అప్పటికే ఫణికుమార్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. అప్పటి వరకు తమతో ఉండి పాల ప్యాకెట్ తీసుకు వచ్చేందుకు వెళ్లి కానరాని లోకాలకు వెళ్లడంతో తట్టుకోలేని తల్లి అస్వస్థకు గురి కాగా భార్యా దిక్కుతోచని స్థితిలో తమకు ఇంకెవరు ఆధారం అంటూ కుమారుడిని హత్తుకొని గుండెలు పగిలేలా రోధించింది. ప్రమాద సమాచారం అందుకున్న ఒకటవ పట్టణ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ బాబురావు, సీనియర్ నాయకులు పి కొండయ్య, ఆర్టీసీ ఎస్డబ్ల్యుఎఫ్ యూనియన్ నాయకులు బి శ్రీనివాసరావు, వైవి రావు, ఇతర నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

బాడీ బిల్డింగ్ విజేతలుగా చీరాల యువకులు

ప్రజాశక్తి - చీరాల


బాడీ బిల్డింగ్ విజేతలతో ట్రైనర్ గుమ్మడి బూన్

బాడీ బిల్డింగ్ పోటీల్లో చీరాల యువకులు విజయం సాధించి పతకం కైవసం చేసుకున్నారని ఫిట్నెస్ జిమ్ ట్రైనర్ గుమ్మడి బూన్ సోమవారం తెలిపారు. ఈ నెల 15న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో 55కేజీల విభాగంలో తలపడి మండలంలోని పాత చీరాలకు చెందిన సూరిన భాస్కరరెడ్డి రాష్ట్ర స్థాయి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. 50కేజీల విభాగంలో అదే గ్రామానికి చెందిన మేరుగు కిషోర్ 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. తమ విజయానికి దోహదపాడిన ఫిట్నెస్ జిమ్ ట్రైనర్ గుమ్మడి బూన్‌కు విజేతలు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

ప్రజాశక్తి - భట్టిప్రోలు


ఫాగింగ్ ప్రారంభించిన సర్పంచ్ రవికిరణ్మయి

మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామంలో దోమల నివారణకు 5వ వార్డు నుండి ఫాగింగ్ స్ప్రే చేయటాన్ని సర్పంచ్ దారా రవి కిరణ్మయి చెన్నయ్య ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన మందును పిచికారి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలకు దోమల ద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మురుగు కాలువలు ఊడిపోవడంతో వాటి పూడికతీత చేపట్టి చెత్తా, చెదారాలన్నీ శుభ్రపర్చినట్లు తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహమ్మద్ ప్రవక్త జయంతి

ప్రజాశక్తి- సంతమాగులూరు


రేపల్లెలో మిలాద్ ఉన్ నబీ ఉత్సవాల్లో ముస్లింలు

మండలంలోని కొమ్మాలపాడు, ఏల్చూరు, సంతమాగులూరు, కొప్పరం గ్రామాల్లో సోమవారం మిలాద్-ఉన్-నబీ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆయా గ్రామాల మసీదుల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి పూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన కారణ జన్ముడు మహమ్మద్ ప్రవక్త జన్మదినమే మిలాద్-ఉన్-నబీ పండుగ అన్నారు.

రేపల్లె : ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను భోదించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో 'మీలాద్ ఉన్ నబీ' పండుగను పట్టణంలో భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. తూర్పు మసీదు వద్ద నుండి ముస్లిం సోదరులు పురవీధుల్లో లక్ష్మి సెంటర్ వరకు అక్కడి నుండి ప్రకాశం రోడ్డులో గుండా జామియా మసీదు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈద్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జమీర్ మోహద్దీన్ తదితర మత పెద్దలు, ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో జామియా మసీదు వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు.

యద్దనపూడి : మండలంలోని పూనూరు, గన్నవరం, పోలూరు, జాగార్లమూడి, యద్దనపూడి గ్రామాల్లో ముస్లిం సోదరులు మిలద్ ఉన్ నబి పండుగ ఘనంగా జరిపుకున్నారు. ఆటలు పోటీలు నిర్వహించి పిల్లలుకు బహుమతులు అందించారు.

పర్చూరు : మిలాద్ ఉన్ నబి పండుగను స్థానిక అతహార్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు స్థానిక మసీదులో సమావేశం అయ్యారు. దానధర్మాలు చేసి అన్య మతస్థుల మన్ననలు పొందాలని అన్నారు. ఆపదలో ఉన్న వారిని అదుకున్నప్పుడే మనం చేసే ప్రార్థనకు నిజమైన సార్ధకత చేకూరుతుందని వివరించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ అహ్మద్ భాషా, షేక్ కాలేష, యాసిన్ భాష, షేక్ సుభాని, షేక్ మస్తాన్ వలి, ముబ్బుల సర్దార్, మీరావలి పాల్గొన్నారు.


గణేష్ నిమజ్జన మహోత్సవంలో వేషధారణ

గణేష్ నిమజ్జన వేడుకలు

ప్రజాశక్తి - చీరాల

గణేష్ నవరాత్రుల్లో విశేష పూజలు, నైవేద్యాలు అందుకొని నిమజ్జనానికి పయణమైన గణనాధునికి వైభవంగా భక్తులు వీడ్కోలు పలికారు. చీరాల పట్టణం, రామకృష్ణపురం, లక్ష్మిథియాటర్ దగ్గరలోని సుబ్బారెడ్డి నగర్‌లో అన్నపురెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గత 15ఏళ్ల నుంచి నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలు నేటితో ముగిశాయి. సుబ్బారెడ్డి నగర్ నుంచి బయలుదేరిన గణనాధుని ప్రత్యేక వాహనం కోట్ల బజారు, ముంతావారి సెంటర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా వాడరేవు తరలించారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


త్రివిక్రమ స్వామి కళ్యాణ మహోత్సవం

త్రివిక్రమ స్వామి కళ్యాణం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరులోని శ్రీ త్రివిక్రమ స్వామి దేవస్థానం నందు పవిత్రోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి నిత్య కైంకర్య హోమం అనంతరం స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంను చెరుకూరుకు చెందిన మాజీ జెడ్పిటిసి రామకృష్ణ దంపతులు కైకర్యం నిర్వహించి కళ్యాణంకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదంలు అందించారు. తిరుపతి నుంచి శ్రీ భవనారాయణ స్వామి బృందం కళ్యాణత్యం కనుల విందుగా జరిపించారు. కార్యనిర్వహణాధికారి నాగయ్య పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పజాశక్తి - కారంచేడు

మండలంలోని కారంచేడు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎఈ రాంబాబు తెలిపారు. కారంచేడు, కుంకలమర్రు, తిమిడిదపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ఉచిత పంటలబీమా అమలు చేయాలి

రైతు సంఘం జిల్లా నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - ఇంకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం రబీ, ఖరీఫ్ సీజన్లకు కొత్త పంటలబీమా విధానం ప్రకటించింది. కొత్త విధానం ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అవకాశం కల్పించడం ద్వారా వాటికి లాభందాయకంగాను, రైతులకు నష్టదాయకంగాను ఉంటుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావు ఆరోపించారు. ఈ విధానం సరైనది కాదని గత పదేళ్ల అనుభవం చెబుతుందని పేర్కొన్నారు. అ అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ నూతన భీమా విధానం రద్దు చేసి సమగ్ర ఉచిత పంటల బీమా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం వేసే విధానాన్ని మానుకోవాలని అన్నారు. గతంలో బ్యాంకులో పంటల ఋణం తీసుకునే రైతులకు భీమా ప్రీమియం ఋణం నుండి మినహాయించుకొని రైతుల వాటా బ్యాంకులు చెల్లించే విధానం అమలులో ఉందని, ప్రస్తుతం ప్రతిపాదించిన విధానంలో రైతులే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బ్యాంకులు గాని, ప్రభుత్వం కానీ బీమా ప్రీమియం చెల్లించవని తెలిపారు. ఆ బాధ్యత రైతుల మీద పెట్టడం ఏ మాత్రం సరైనది కాదని అన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమాలో భాగంగా ప్రయివేటు భీమా కంపెనీలకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రయివేటు కంపెనీలకు లాభాలు తెచ్చి పెడతాయి తప్ప రైతుల ప్రయోజనాలు ఏ మాత్రం పట్టించుకోవని పేర్కొన్నారు. ఈ విధానం రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తుందని అన్నారు. కనుక ప్రభుత్వ భీమా కంపెనీలను మాత్రమే పంటల బీమాలో భాగస్వాములను చేయాలని కోరారు.


రైతు సంఘం జిల్లా నాయకులు తలపనేని, కందిమళ్ల

స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ 'నంద'

ప్రజాశక్తి - సంతమాగులూరు

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈనెల 14, 15తేదీల్లో జరిగిన ఆంధ్రప్రదేశ్ 11వ అన్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద రెండు పతకాలు సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో బాపట్ల జిల్లా తరఫున 76కేజీల విభాగంలో పోటీపడి బెంచ్ ప్రెస్ నందు గోల్డ్ మెడల్ సాధించి స్టేట్ చాంపియన్‌గా నిలిచారు. అంతేకాకుండా అన్ ఎక్యూపుడు పవర్ లిఫ్టింగ్ విభాగంలో 265కేజీల బరువును ఎత్తి మరొక రజిత పతకాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు పతకాలు గెలిచి జిల్లా తరపున విజయ బావుట ఎగురువేశారు. అయితే ఈ పోటీల్లో బెంజ్ ప్రెస్ చేస్తున్న సమయంలో నందా ఎడమ చేతికి గాయమై నప్పటికీ పోటీల్లో నిష్క్రమించకుండా పాల్గొని విజయం సాధించిన ఆమె క్రీడా స్ఫూర్తికి అభినందనలు వెల్లువెత్తాయి. వృత్తి రీత్యా న్యాయవాదిగా సేవలందిస్తూనే పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా వైస్ చైర్మన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పవర్ లిఫ్టింగ్ క్రీడపై ఉన్న మక్కువతో పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధించడం పట్ల ఆమె తల్లి, దండ్రులు, గ్రామస్తులు, క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌గా కుమారి నంద

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- అధునాత కార్యాలయంలో పగలగొట్టిన మరుగుదొడ్లు
- నిర్వహణ గాలికొదిలేసిన పురపాలక అధికారులు
- లక్షల నిధులు ఖర్చుపెట్టినా దక్కని ప్రయోజనం

ప్రజాశక్తి - చీరాల

విద్య, వైద్యం, వాణిజ్య సముదాయాలతో నిత్యం జనంతో రద్దీగా ఉండే ఇరుకైన పట్టణం. వివిధ ప్రాంతాల నుండి నిత్యం జనం పట్టణానికి వస్తుంటారు. ఆ ప్రజలతో నిత్యం రహదారులన్నీ రద్దీగా ఉంటాయి. అయితే ప్రజల కనీస అవసరాలు తీర్చుకునేందుకు వీలు లేకుండా పోతుంది. అత్యవస పరిస్థితుల్లో మూత్ర విసర్జన చేయాలని ఉగ్గబట్టుకోవాల్సిందే. లేకుంటే బహిరంగంగా రోడ్ల వెంబడి తననెవ్వరూ చూడట్లేదనుకుని కాల్వల్లో వదిలేయాల్సిందే. మహిళల పరిస్థితి మరింత వర్ణణాతీతం. ఇంటి నుండి బయటికొస్తే తిరిగి వెళ్లే వరకు గుక్కెడు నీళ్లు తాగాలన్నా ఆలోచించే పరిస్థితి. పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకుంటున్న పాలకులకు ఈ సమస్య పట్ల బాధ్యత లేకపోవడం విమర్శలకు కారణమవుతుంది. మూత్ర విసర్జన చేయాలంటే బస్టాండ్, రైల్వే స్టేషన్ రోడ్లు పట్టుకుని పరుగులు తీయాల్సిందే. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం తీసుకున్నది. బహిరంగ విసర్జనను నిర్మూలించిన పట్టణాలను ఒడిఎఫ్ అవార్డులు ఇచ్చింది. గతంలో చీరాల పట్టణం అలాంటి అవార్డుల్లో ఒకటి పారిశుద్య నిర్వహణలో అందుకున్నారు. పట్టణ ప్రజల అవసరాల కోసం పురపాలక సంఘం నిధులతో ముక్కోణం పార్కు పెట్రోలు బంకు ఎదురు, ఆర్టీసీ బస్టాండు ఆవరణలో, కెజిఎం బాలికోన్నత పాఠశాల ప్రహరీకి అనుకుని మూత్ర శాలలు నిర్మించారు. నిధులైతే ఖర్చు పెట్టారు తప్ప వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో చెత్త, చెదారంతో నిరుపయోగంగా మారాయి. మున్సిపల్ కార్యాలయానికి వివిధ పనులపై వెళ్లే వారికోసం కార్యలయం లోపుల ఏర్పాటు చేసిన మరుగు దొడ్లు కూడా నిరుపయోగం, దుర్గంధంతో నిండిపోవడంతో మరమ్మత్తుల కోసం మొత్తం గదులు పగులగొట్టారు. గోడలకు అంటించిన టైల్స్ సైతం తొలగించారు. పున నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు, కార్యాలయంలో పనిచేసే సిబ్బంది మూత్ర విసర్జనకూ ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులైతే అధికారుల గదుల్లో ఉన్న మరుగుదొడ్లను, పై అంతస్థులో ఉన్న వాటినీ వినియోగిస్తున్నారు. అంగ వైకల్యం కలిగిన వాళ్ల పరిస్థితి మరింత దారుణం. పై అంతస్థుకు ఎక్కలేక, కింద మరుగుదొడ్లు లేక బయటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ కార్యాలయంలోనే నెలల తరబడి మరుగుదొడ్లు పనిచేయకపోయినా పట్టించుకోని అధికారులు, పురపాలకులు పట్టణ ప్రజలను ఏమి పట్టించుకుంటారనే విమర్శలకు అధికారులు సమాధానం చెప్పుకోవాల్సి ఉంది.


మున్సిపల్ కార్యాలయంలో పునర్నిర్మాణంలో మరుగుదొడ్లు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం : కమిషనర్ చక్రవర్తి

మరుగుదొడ్లు లేక ప్రజల అవస్థలు గుర్తించామని, తాను నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టినందున పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చక్రవర్తి తెలిపారు. పట్టణంలో మరమ్మత్తులకు గురైన మరుగు దొడ్లను పరిశీలించి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యాలయంలోని మరుసుగదొడ్లను గతంలో పూర్తిగా పాడైపోవడంతో మరమ్మత్తుల చేయిస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తామని తెలిపారు.


కమిషనర్ చక్రవర్తి


అవార్డు గ్రహీత దంపతులను సత్కరిస్తున్న ఎంఇఒలు

ఉత్తమ అవార్డు గ్రహీత పద్మావతికి సత్కారం

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండలంలోని బాలవారిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న తోటకూర పద్మావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం అభినందన, సన్మాన సభ నిర్వహించారు. ఎస్టీయూ మండల అధ్యక్షులు మోపిదేవి తులసీదాస్ అధ్యక్షతన వహించగా ఎంఈఓలు సురేష్, శేషు గోపాలం హాజరై మాట్లాడారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది, వారి జీవితానికి సార్ధకత తీసుకువచ్చే ఉపాధ్యాయ వృత్తి ఎంతో మహొన్నతమైందని అన్నారు. అవార్డు గ్రహీత పద్మావతి ఎంతో నిబద్ధతతో తన 41ఏళ్ల సర్వీసులో ఎందరో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ కె హరిబాబు, ప్రజ్ఞం, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కొలసాని రమేష్, ఎస్టీయూ జిల్లా నాయకులు బడుగు శ్రీనివాస్, గుడివాడ అమర్నాథ్, ఎపిటిఎఫ్, యుటిఎఫ్, పిఆర్టీయు సంఘాల బాధ్యులు అవార్డు గ్రహీత పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.


సాయం అందుకున్న ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు

ప్రైవేటు ఉపాధ్యాయులకు సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల వరదల కారణంగా భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె, వేమూరు మండలాల్లోని లంక గ్రామాల్లో ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు సోమవారం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్ల ద్వారా సేకరించిన విరాళం రూ.1.8లక్షలతో ఉపాధ్యాయుల కోసం అవసరమైన సరుకులను పెసర లంక స్వాతి పాఠశాలలో 40మంది ఉపాధ్యాయులకు అందిజేసినట్లు కోశాధికారి వేల్పూరు నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలలు కూడా పూర్తిగా వరద నీటిలో మునిగి దెబ్బతిన్నాయని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రవి శంకర్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి అక్కిరెడ్డి, రేపల్లె అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు పార్థసారథి, విశ్వశాంతి, కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఆనందబాబు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని చింత లంక గ్రామంలో అరవిందు వారిది సృష్టికర్త వేమూరి లక్ష్మయ్య జ్ఞాపకార్థం ఆయన మనవడు, ఎన్ఆర్ఐ వేమూరి అరవింద్ సహాయ సహకారంతో శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా సోమవారం నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న జ్యోతి రమేష్‌బాబు

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

ఈనెల 14న ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒంగోలులోని అంబేద్కర్ భవన్లో జరిగిన హలో మాల, చలో ఒంగోలు కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో బైక్ ప్రమాదంలో చనిపోయిన కందుకూరు గ్రామంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన జెట్టి అరిస్టాటిల్ కుటుంబాన్ని అద్దంకికి చెందిన ఉద్యోగ, మాల సంఘాల సోదరులు ఎపి ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనారిటీస్ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణ మూర్తి, సభ్యులు జగన్నాథం యోహాను, మద్దుమాల పుల్లారావు, ఇస్తర్ల వెంకట సుబ్బారావు,నల్లపు చంద్రశేఖర్, పూరి మెట్ల హరి నారాయణ కందుకూరులోని అరిస్టాటిల్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. దాతలు అందించిన రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అరిస్టాటిల్ కుటుంబ సభ్యులకు అందించారు. భవిష్యత్తులో అండగా ఉంటామని తెలిపారు.


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో నారాయణ

27మంది ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని బేతపూడి రోడ్డులో గల శారద ఐటిఐ కళాశాల నందు సోమవారం జరిగిన జాబ్ మేళాలో 27 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ బడుగు వెంకట నారాయణ చెప్పారు. దివిస్ ఫార్మా కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాలో ఐటిఐ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డీజిల్, మెకానిక్ చదివిన 10మంది అభ్యర్థులు ఎంపికైనట్లు తెలిపారు. బిటెక్, బిఎస్‌సి కెమిస్ట్రీ, బీఫార్మసీ చదివిన అభ్యర్థులు 17మంది ఎంపికైనట్లు తెలిపారు. ఐటిఐ అభ్యర్థులకు నెలకు రూ.15వేలు, బిఎస్‌సి అభ్యర్థులకు రూ.18వేలు, బీటెక్, బి ఫార్మసీ అభ్యర్థులకు రూ.20వేలు వేతనంతోపాటు ఇతర అలవెన్సులు వుంటాయని తెలిపారు. డివిస్ ఫార్మా కంపెనీ హెచ్ఆర్ హరికృష్ణ, హెచ్ఆర్ అమర్, ప్లేస్మెంట్ అధికారి మండే ప్రసాద్, ఆవుల భుజంగరావు పాల్గొన్నారు.

మాగాణికి చెరువు నీరు విడుదల

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు గ్రామంలో చెరువు నీటిని పంట కాలువ నుంచి మాగాణికి గ్రామ ఉప సర్పంచ్ గుండవరపు సుబ్బారావు, టిడిపి నాయకులు ఆళ్ల అవినాష్ సోమవారం విడుదల చేశారు. దీనివల్ల 200 ఎకరాలు మాగాణి భూమి సాగులోకి రానున్నది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్నం వెంకట్రావు, ఆకుల బ్రహ్మయ్య, మాదాల సుబ్బారావు, పెరుగు అంజయ్య, కే ఎల్లమందయ్య, పెరుగు రాము, షేక్ మస్తాన్, పమిడి బ్రహ్మయ్య తదితరులు



నీటిని విడుదల చేస్తున్న ఉప సర్పంచి గుండవరపు సుబ్బారావు

అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో ఆదివారం ,సోమవారం అండర్- 14 బాలుర జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 33 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. అనంతరం కోరిశపాడు మండలం మండలం రావినూతల గ్రామంలో క్రికెట్ స్టేడియంలో రెండు రోజుల మ్యాచ్‌లు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మందిని ప్రధాన జట్టుకు, ఐదుగురిని స్టాండ్ బైగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసి యేషన్ కార్యదర్శి కారసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు అక్టోబర్ 1 నుంచి నిర్వహిస్తున్న ఇంటర్ డిస్ట్రిక్ మ్యాచ్‌లలో ప్రకాశం తరపున పాల్గొంటారని తెలిపారు. సెలెక్టరుగా మాజీ రంజీ ప్లేయర్ తాటికొండ వంశీకష్ణ. మాజీ స్టేట్ క్రీడాకారులు శ్రీకష్ణ విజయకుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మోహన్ దాస్, అసోసియేషన్ సభ్యులు కొల్లా మధు , సాయి కష్ణ, కమిటీ సభ్యుడు శేషు, కోచ్‌లు సుధాకర్, చంద్ర శేఖర్, సెలక్షన్ కమిటీ సభ్యులు శ్రీకష్ణ, వంశీకష్ణ , గ్రౌండ్‌మెన్ అజయ్ పాల్గొన్నారు.



జిల్లాజట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 బాలుర క్రికెట్ జట్టు ఇదే..

ఆర్. హేమంత్ రాయల్(కెప్టెన్/వికెట్ కీపర్), ఎవి. చరణ్(వైస్ కెప్టెన్), ఎం.లిఖిత్, బి.లోకేష్, ఐవి.నీరజ్, పి. రాజమోహన్(వికెట్ కీపర్), ఎం. పృథ్విరాజ్, శైలేంద్ర, కె.రాంచరణ్, జె.దినేష్, కె. ఉదయ్ నాయుడు, ఎస్‌కె. లతీఫ్, బి.నిరంజన్ బి.నిశాంత్, వి.రిషిక్ చక్రవర్తి ఎంపికయ్యారు. స్టాండ్ బైగా ఎం.గగన్‌రెడ్డి, ఆర్.నీరజ్, కిరణ్, జి.కౌశిక్, కె.శ్రీవెంకట్, టి.శ్యామ్ దీపక్ ఎంపికయ్యారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమని, మార్కాపురం వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేసి వచ్చే ఏడాది నుంచి ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్. వినోద్ డిమాండ్ చేశారు. విద్యను హక్కుగా అందించాల్సిన భాధ్యత ప్రభుత్వానిదని, తన భాధ్యతను మరిచి ప్రైవేట్‌కు వైద్య విద్య పట్టం కట్టడం దుర్మార్గమన్నారు. కేంద్రంతో సంప్రదించి 5 కళాశాలలకు అనుమతులు తీసుకురావల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఎన్ఎంసికి లేఖ రాయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవన్నారు. 700 సీట్లు ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల కోల్పోయామని తెలిపారు. ఇది కేవలం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలనే దుర్మార్గపు అలోచల నుంచి చేస్తున్న చర్యగా భావిస్తున్నామన్నారు. ప్రైవేటీకరణ జరిగితే అనేక మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. రిజర్వేషన్ల ఊసే ఉండదని తద్వారా వెనకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫ్‌ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారని, ఇచ్చిన హామీపైన ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు మాట ఇచ్చి వచ్చాకా వాటి ఊసెత్తకపోవడం కూటమి ప్రభుత్వ వైఖరిగా ఉందన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రైవేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలన్నారు. సెల్ఫ్‌ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు.



కొల్లూరు మండలం అరవింద వారధి వద్ద పడిన గండి(ఫైల్)

పంట కాలువలకు గండ్లు

మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వరదల కారణంగా జిల్లాలో మురుగు కాలువలు, పంట కాలువలు చిన్నాభిన్నమయ్యాయి. ఊహించని రీతిలో వచ్చిన వరద పంట పొలాలలోని డ్రెయిన్లు, కాలువలను ఏకం చేస్తూ పారింది. వందల సంఖ్యలో గండ్లు పడి కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లింది.

ప్రతియేటా జిల్లా లోని రైతులు భారీవర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది డిసెంబరులో కురిసిన భారీవర్షాలతో కాలువలు పొంగి పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. రైతులకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్లు, పంట కాలువల మరమ్మతులకు గురయ్యాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో డ్రెయిన్లు, పంట కాలువల మరమ్మతులకు తగిన మేర నిధులు విడుదల కాలేదు. దీంతో అరకొరగానే పనులు చేశారు.వచ్చిన కొద్దిపాటి నిధులతో కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క, జమ్ములను కొంత మేర తొలగించారు. ఫలితంగా ప్రసుత్తం వచ్చిన వరదల కారణంగా జలవనరులశాఖ, మురుగునీటి పారుదల శాఖలకు భారీగా నష్టం వాటిల్లింది. రైతులు కోలుకోని రీతిలో నష్టాపోయారు. వేమూరు, రేపల్లె, బాపట్ల,పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని మురుగు కాలువలు, పంట కాలువలు దెబ్బతిన్నాయి. రైతులు తిరిగి వ్యవసాయ పనులు ప్రారంభించాలంటే తక్షణమే కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిఉంది. అందుకు కోసం సంబంధిత శాఖల అధికారులు తక్షణ, శాశ్వత ప్రాతిపదికన గండ్లు పూడ్చేందుకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చీరాల డ్రెయినేజి డివిజన్ పరిధిలో 22 పనులకు తక్షణ మరమ్మతుల కోసం రూ. 98 లక్షలు, శాశ్వత పనుల కోసం రూ.2.96 కోట్లతో అంచనాలు రూపొందించారు.రేపల్లే డ్రెయినేజి డివిజన్ పరిధిలో 108 పనులకు తక్షణ మరమ్మతుల కోసం రూ.5.07 కోట్లు, శాశ్వత పనుల కోసం రూ.120 కోట్లతో అంచనాలు రూపొందించారు. వరదల కారణంగా కృష్ణాపశ్చిమ డెల్టాలో కొమ్మమూరు కాలువ, పలు పంట కాలువలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల కాలువలకు గండ్లు పడ్డాయి. కాలువ గట్లను పటిష్టపరచాల్సి ఉంది. ఇందుకోసం తక్షణ, శాశ్వత ప్రాతిపదికన గండ్లు పూడ్చేందుకు జలవనరులశాఖ జిల్లా అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతున్నారు. జిల్లాలో మొత్తం 48 చోట్ల గండ్లు పూడ్చి కాలువలను పటిష్టపరిచేందుకు తక్షణ మరమ్మతుల నిమిత్తం రూ.1.59 కోట్లు, శాశ్వత పనుల కోసం రూ.3.27 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించారు. జిల్లాలో మొత్తం 178 పనులు చేపట్టేందుకు తక్షణ నిధులు రూ. 7.98 కోట్లు, శాశ్వత పనుల కోసం రూ.126 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తొలుత తక్షణ మరమ్మతుల కోసం రాష్ట్రప్రభుత్వం నిధులు విడుదల చేస్తే త్వరితంగా కాలువల గండ్లు పూడ్చే అవకాశం ఉంది. పనులు పూర్తయితేనే రైతులు రెండో పంట సాగుకు సన్నద్ధమయ్యే అవకాశం కలుగుతుంది. రాష్ట ప్రభుత్వ తమ మేలు కోసం తక్షణమే నిధులు మంజూరు చేస్తుందని రైతులు ఆశతో ఉన్నారు.

ముగిసిన యుటిఎఫ్ ఆటల పోటీలు

రెండో రోజు పోటీలు ప్రారంభించిన కొమ్మోజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ప్రకాశం జిల్లా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఆటల పోటీలు సోమవారంతో ముగిశాయి. ఒంగోలు నగరంలోని డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో రెండవ రోజు ఆటల పోటీలను యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, సమైక్యత, సహకార భావం, క్రమశిక్షణ, కలిసి మెలిసి జీవించడం, అభిప్రాయాలను గౌరవించుకోవడం, ఒకరి పట్ల ఒకరు క్రమశిక్షణతో వ్యవహరించడం వంటి అంశాలను పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ ఆటల పోటీల ద్వారా ఉపాధ్యాయులకు ఆటవిడుపు అవుతుందన్నారు. జిల్లా స్థాయిలో క్రికెట్, వాలీబాల్ , టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్, 100 ,200 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల స్పీడ్ వాకింగ్ , జావెలిన్ తో షాట్ పుట్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజులు సుమారు 600 పైగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సంఘం స్వర్ణోత్సవ వాల డిసెంబర్ 14,15,16,17 తేదీల్లో కాకినాడలో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ ఆటల పోటీలను నిర్వహించామన్నారు.



క్రికెట్ పోటీలలో విజేతగా నిలిచిన వై.పాలెం జట్టు

ఆటల పోటీల విజేతలు వీరే...

క్రికెట్ పోటీలలో యర్రగొండపాలెం జట్టు మొదటి స్థానం, ముండ్లమూరు జట్టు రెండో స్థానంలో నిలిచాయి. ఉమెన్స్ 400 మీటర్ల స్పీడ్ వాకింగ్ లో ఎల్ఆర్ఎస్ స్రవంతి, అరుణ కుమారి, మెహిబూన్, శ్రీదేవి గెలుపొందారు. 400 మీటర్ల అండర్- 45 విభాగంలో మొదటి స్థానంలో వి.కవిత, రెండవ స్థానంలో వి కల్పన, మూడో స్థానం జగదీశ్వరి ఎస్‌కె.బషీరా విజయం సాధించారు. 100 మీటర్ల పరుగు పందెం మహిళల విభాగంలో ప్రథమ స్థానం ఎస్‌కె.మెహిబూన్, ద్వితీయ స్థానం ఎల్లా స్రవంతి, తృతీయ స్థానం టి.మేరీ కుమారి సాధించారు. షాట్‌పుట్‌లో బి.బ్రహ్మయ్య మొదటి స్థానం (ముండ్లమూరు మండలం) రెండో స్థానం ఎస్‌కె.సూరత్ బాషా (కొత్తపట్నం మండలం), మూడోస్థానం కె. శివ కోటేశ్వరరావు (మర్రిపూడి మండలం) విజయం సాధించారు. రెండో రోజు ఆటల పోటీలను జిల్లా ఆటల కమిటీ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఓ.వీరారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి. ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి పి. బాల వెంకటేశ్వర్లు, ఎస్‌వి. కొండారెడ్డి, పి. ప్రభాకర్ రెడ్డి, కె. లక్ష్మీనారాయణ, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు



చెస్‌లో తలపడుతున్న మహిళా ఉపాధ్యాయునులు